ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
శనివారం 13 జూలై 2024

సీలింగ్ భూములను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

కందుకూరు, జూలై 12: కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా వివాదంలో ఉన్న సీలింగ్ భూములను శుక్రవారం డిప్యూటీ కలెక్టర్ జీవీ రాజు పరిశీలించారు. పులిమామిడి రెవెన్యూ పరిధిలోని 77వ సర్వే నెంబర్‌లో సీలింగ్, పట్టా భూముల వల్ల తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని రైతులు జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యలు విన్నవించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం డిప్యూటీ కలెక్టర్ జీవి.రాజు మండల సర్వేయర్ పాండు రంగారెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్‌లతో కలిసి సీలింగ్ భూములను పరిశీలించి బోర్డులు పాతారు.

ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే యాదయ్య



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 12 : చేవెళ్ల పట్టణంలోని చంద్రారెడ్డి నగర్ కాలనీలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులుగా వేదమంత్రోచ్చరణ మధ్య పూజలు కొనసాగాయి. శుక్రవారం కాలనీవాసులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, టీవీ, సినిమా ఆర్టిస్టు బిత్తిరి సత్తితోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులను పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి సమతారెడ్డి దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సున్నపు వసంతం, మాజీ జడ్పీటీసీ మాలతీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు బండారు శైలజా ఆగిరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్, భీమయ్య, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు, సీనియర్ నాయకులు దేవర కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరుచుకున్న పచ్చదనం.. రైతు కళ్లలో ఆనందం

ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు అక్కడక్కడా పంటలు పచ్చబడుతున్నాయి. యాచారం మండలం కుర్మిద్దలో చిరు జల్లులకు మొక్కజొన్న ఏపుగా పెరిగి పచ్చదనంతో చూపరులను ఆకర్షిస్తుంది. ఇంతకాలం వర్షాలు లేక ఎండుముఖం పట్టిన పంట పచ్చదనాన్ని సంతరించుకోవడంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

\- యాచారం, జూలై 12



కుర్మిద్దలో ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట

గీత కార్మికులకు లైఫ్ సేవ్ కిట్స్

» రేపు లష్కర్‌గూడలో సీఎం చేతుల మీదుగా పంపిణీకి శ్రీకారం

» ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శశాంక, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



లష్కర్‌గూడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

రంగారెడ్డి అర్బన్, జూలై 12 : తాటిచెట్టు ఎక్కే క్రమంలో కల్లు గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా లైఫ్ సేవ్ కిట్స్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులకు వీటిని అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో నిర్వహించే ఈ కార్యక్రమం కోసం అధికారులు చకచకా ఏర్పాటు చేస్తున్నారు. ఎక్సైజ్, రెవెన్యూ, బీసీ సంక్షేమశాఖ అధికారులతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ శశాంక, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి లష్కర్‌గూడలో సీఎం రాకకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లు గీత కుటుంబాలు కులవృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. కల్లు గీస్తున్న క్రమంలో ఏటా ఎంతో మంది ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. మరణాల బారిన పడకుండా బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. గీత కార్మికులు మరణాల బారిన పడకుండా 'గీత కార్మిక లైఫ్ సేవ్ కిట్' ను అందుబాటులోకి తీసుకురాబోతున్నదన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ కార్యక్రమం జరిగే స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అదేవిధంగా పార్కింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదివారం లష్కర్‌గూడ చేరుకుని, అక్కడ జరిగే కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరిగి వెళ్లే వరకు ఎవరెవరికి అప్పగించిన బాధ్యతలను వాళ్లు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్‌రెడ్డి, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోరంబోకు పట్టాగా మారిందెలా?




వడ్డించే వాడు మనవాడైతే.. అన్న సామెత సరిగ్గా సరిపోతుంది ఇక్కడ. గత ప్రభుత్వ హయాంలో కొందరు పెద్దలు పోరంబోకు భూములను పట్టా భూమిగా మార్చుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ తతంగమంతా జరిగింది. కొందరు రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ సంస్థల పేర్ల మీదకు ఈ భూమి మారింది. అయితే, ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇదంతా వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమాలపై నిగ్గు తేల్చే పనిలో అధికారులు ఉన్నారు. జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు టాస్క్‌బృందాల్లో ఒక బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు.

» రూ.300 కోట్ల భూములపై కలెక్టర్ విచారణ

» మంఖాల్‌లో 33.08 ఎకరాలకు పాస్‌బుక్‌లు జారీ

» ఎన్నికల ముందు చకచకా కదిలిన ఫైళ్లు

» నిషేధిత జాబితాలో ఉన్నా పాస్‌బుక్‌లు జారీ



53	507	2.36	p.p	2.36		596	598	591	way	House sites
54	599	6.26	Gairan	5.00	1.26	597	way	594	way	House sites
55	602	41.05	p.p	41.00	0.05	Way	603	515	601, 821	
56	608	10.37	p.p	10.37		604	609	607	828	
57	609	13.12	p.p	13.12		608	610	607	825	
58	610	11.27	p.p	11.27		609	743	611	824	
59	615	19.38	Shikkam	19.38		tan	614	616	602	Raikunta Shikam cheruvu
60	625	19.24	p.p	19.24		628	683	626	623, 624	Raikunta Shikam cheruvu

పోరంబోకు భూమిగా నమోదైన రికార్డు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

నగర శివార్లలోని దాదాపు రూ.300 కోట్లకు పైగా విలువ చేసే 33.08 ఎకరాల పోరంబోకు భూములకు రెక్కలు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఈ విలువైన భూములకు కొత్త పాస్‌బుక్‌లు జారీ చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు రావడంతో భూమిపై జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మహేశ్వరం మండలం మంఖాల్‌లోని 608, 609, 610 సర్వే నంబర్లలో 33.08 ఎకరాల భూమి 22ఏ కింద గతంలో నిషేధిత జాబితాలో పెట్టారు. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూమి పోరంబోకు/గైరానా సర్కారీ నమోదైంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం వెబ్‌సైట్‌లో కూడా ఇప్పటికీ ఈ భూమి నిషేధిత జాబితాలోనే ఉంది. అయితే గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ఈ భూములకు రెక్కలు వచ్చాయి. ఈ భూమి మొత్తం పట్టా భూమిగా మారిపోయింది. దీనికి సంబంధించిన ఫైళ్లన్నీ చకచకా సచివాలయం వరకు కదిలాయి. కొందరి పేరు మీద పాస్‌బుక్‌లు కూడా ఆగమేఘాలపై జారీ చేశారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు ప్రభుత్వ భూములుగా చెలామణీ అయిన ఈ భూములు ఒక్కసారిగా పట్టా భూములుగా మారాయి. కొందరు రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ సంస్థల పేర్ల మీదకు ఈ భూమి మారింది. ప్రభుత్వం మారడంతో దీనిపై స్థానికులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు బడా రాజకీయ నేతలు, రియల్ వ్యాపారులు కలిసి ఈ భూములు కొల్లగొట్టారని దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రభుత్వానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే పని చేస్తున్న రెండు టాస్క్‌బృందాల్లో ఒక బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే ఇదే సమయంలో స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మొత్తం ఈ వ్యవహారంపై డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజశేఖర్ లోతుగా విచారణ జరుపుతున్నారు. మొత్తం ఈ భూమి వ్యవహారంపై రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

1975నుంచి రికార్డులు గల్లంతు

మంఖాల్‌లోని ఈ భూములకు సంబంధించిన రికార్డులు కొన్ని గల్లంతైనట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే తొలుత ఈ భూమి సేత్వారీలో పట్టాగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. తరువాత కొన్నాళ్లు ప్రభుత్వ రికార్డుల్లో అలానే కొనసాగినప్పటికీ 1975నుంచి ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులు గల్లంతయ్యాయి. అనుభవదారుల కాలమ్‌లో కొందరు వ్యక్తుల పేర్లు కొనసాగాయి. అయితే 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో పోరంబోకు/సర్కారీ గైరానా అని నమోదవుతూ వస్తోంది. చివరకు 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. దీంతో ఈ భూముల జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ కొందరు పేర్లు మాత్రం అనుభవదారుల కాలమ్‌లో రాశారు. సేత్వారీలో గతంలో పట్టాగా నమోదైందని చెబుతూ దీని ఆధారంగానే మిగతా వ్యవహారమంతా నడిపి ఫైల్ క్లియర్ చేసుకున్నట్లు తెలిసింది.

ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్

సీఎం ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి, సీఎం సొంత జిల్లాలోనే బీజేపీ జెండా ఎగిరింది

» పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలవలేదు

» స్థానిక ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించాలి

» రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సమావేశానికి హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్/శంషాబాద్ రూరల్, జూలై 12 : అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శంషాబాద్‌లో కిషన్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్ సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర నేతలు పాల్గొన్నారు. రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. బీజేపీ సభ్యత్వం, సంస్థాగత ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి నియోజకవర్గంపై కాషాయ జెండా ఎగిరిందని ఆనందం వ్యక్తం చేశారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలవలేక ప్రజాగ్రహానికి గురైందని తెలిపారు. ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలు సాధించేలా పార్టీ శ్రేణులు మరింతగా కృషి చేయాలని ఆయన తెలిపారు. త్వరలోనే గ్రామ స్థాయి నుంచి సభ్యత్వం చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

అబద్ధపు వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి..

» బీజేపీ జాతీయ కార్యదర్శి డీకే అరుణ

కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని బీజేపీ జాతీయ కార్యదర్శి డీకే అరుణ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని రకాలుగా అడ్డుకున్న 8 ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా, అధిక స్థానాలు సాధించేలా బీజేపీ శ్రేణులు మరింతగా కృషి చేయాలన్నారు. ప్రపంచంలో భారత్‌ను నెంబర్ వన్‌గా చేసే సంకల్పంతో మోదీ ముందుకు వెళుతున్నారని ఆమె చెప్పారు.

రేవంత్‌రెడ్డిని బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

» ఎంపీ ధర్మపురి అరవింద్

ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే సీఎం రేవంత్‌రెడ్డిని బొంద పెట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 8 నెలలవుతున్నా ప్రజా సమస్యలు, ఇచ్చిన వాగ్దానాలు అలాగే ఉన్నాయన్నారు. సమస్యలు తీరాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆయన తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీదే భవిష్యత్

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీకే ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసినా మంచి ఫలితాలను బీజేపీ సాధించిందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ వార్డు సభ్యుల నుంచి మున్సిపాలిటీల వరకు అన్ని స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, గూడెపు నాగేష్, ఎమ్మెల్యేలు ఎల్మటి మహేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, పాల్వాయి హరీష్, పాల్వాయి శంకర్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శృతి, కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తల్లోజు ఆచారి, వీరేందర్‌గౌడ్, కేఎస్ రత్నం, అంజన్ కుమార్‌గౌడ్, డాక్టర్ ప్రేమ్‌రాజ్, కొప్పు భాష, తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు బుక్కా వేణుగోపాల్, మైలార్‌దేవుల పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీజేపీ నాయకులకు సన్మానం చేశారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ విలేకరుల వద్దకు వచ్చి వారితో కలిసి భోజనం చేశారు.

కనుల పండువగా పూరీ జగన్నాథ్ రథయాత్ర

వేలాదిగా తరలివచ్చిన భక్తులు » ఆమనగల్లులో మూడు గంటల పాటు సాగిన రథయాత్ర

ఆకట్టుకున్న విదేశీ భక్తుల కీర్తనలు, భజనలు » ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డప్పుల ప్రదర్శన, మహిళల కోలాటాలు



పూరీ జగన్నాథ్ రథయాత్రలో భక్తులు


ఆమనగల్లు, జూలై 12: ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం పూరీ జగన్నాథ్ రథయాత్ర అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ కూకట్‌పల్లి ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. రథయాత్ర నేపథ్యంలో వ్యవస్థాప్రముఖ్ పాపిశెట్టిరాము, కన్వీనర్ తల్లోజు వెంకటయ్య, శోభయాత్ర ప్రముఖ్ ఎంగిళి బాలకృష్ణ, కన్యకాపరమేశ్వరి దేవాలయ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, భజనమండలి వ్యవస్థాప్రముఖ్ ముక్కెరి కృష్ణయ్యల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్పకొండ వద్ద పూరీ జగన్నాథ్ రథయాత్రను ప్రారంభించారు. రథయాత్రకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండ్, మార్కండేయ దేవాలయం మీదుగా రథయాత్ర కన్యకాపరమేశ్వరి దేవాలయానికి చేరుకుంది. అక్కడ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షింగ్‌ప్రభు, విజయ ప్రతాప్ మహారాజ్‌లు మాట్లాడుతూ సమాజ శాంతిని కాంక్షించి ప్రజలంత భక్తిమార్గంలో ముందుకు సాగాలన్నారు. ఆధ్యాత్మిక, దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి, మానవాళి సన్మార్గ పురోగమానికి దోహదపడుతాయన్నారు. రథయాత్ర సందర్భంగా సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ దేవాలయ అధ్యక్షుడు మహర్షింగ్ ప్రభు, ఆర్ట్ ఆఫ్ రిలాగ్జేషన్ ట్రస్ట్ చైర్మన్ విజయ ప్రతాప్ మహారాజ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, నిర్వాహకుడు పాపిశెట్టి రాము, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విదేశీ మహిళలు

ఆకట్టుకున్న విదేశీ భక్తుల కీర్తనలు

పూరీ జగన్నాథ్ రథయాత్రలో విదేశీ భక్తులు సందడి చేశారు. అమెరికా, లండన్, తదితర దేశాలకు చెందిన మహిళా భక్తులు సుమారు 20 మంది పాల్గొన్నారు. వారి భజనలు, కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భారతీయుల దైవ, ఆధ్యాత్మిక మార్గాలు, సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు.



స్వయంశక్తితో ఉపాధి పొందడం హర్షణీయం

కొడంగల్, జూలై 12: మహిళలు స్వయంశక్తితో ఉపాధి పొందడం హర్షణీయమని జిల్లా అటవీ శాఖ అధికారి, కొడంగల్ మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్యలో ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య, సమగ్ర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొంది ఉపాధి పొందుతూ ఇతరులకు ఉపాధినివ్వడం సంతోషదాయకం అన్నారు. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కుట్టు మిషన్ కేంద్రాలు, మహిళా శక్తి కేంద్రాలు, మీసేవ కేంద్రాలతో ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పడి మహిళా సంఘం సభ్యులు గ్రామాల్లో ఇతరాత్ర ఉపాధి వ్యాపారాలు చేస్తారని తెలిపారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల్లో సైతం మహిళా సంఘాలకు ప్రాధాన్య కల్పిస్తోందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉషశ్రీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజిలమ్మ, ఏపీయం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్

19న కొబ్బరికాయల విక్రయానికి వేలం

మోమిన్‌పేట్, జూలై 12: మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ శంకర్ భారత్ మహారాజ్ ఆశ్రమంలో గల ఎన్కతల శనీశ్వర ఆలయంలో ఈ నెల 19న కొబ్బరి కాయల విక్రయం, పూజా సామగ్రి విక్రయానికి వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి వి.నరేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 19న ఉదయం 11:30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం దక్కించుకున్న వారికి ఆలయ ఆవరణలో కొబ్బరి కాయలతో పాటు పూజా సామగ్రిని విక్రయించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన మల్టీజోన్ ఐజీపీ


వికారాబాద్, జూలై 12: వికారాబాద్ ఎస్పీ కార్యాలయాన్ని మల్టీ జోన్ ఐజీపీ సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఐజీపీకి ఎస్పీ నారాయణరెడ్డి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఏఆర్ పోలీస్ అధికారులతో ఐజీపీ గౌరవ వందనం చేశారు. అనంతరం ఐజీపీ జిల్లా ఎస్పీతో జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ అదనపు ఎస్పీ పీవీ మురళీధర్, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



ఐజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎస్పీ


ఘట్‌కేసర్‌లో మోస్తారు వర్షం


ఘట్‌కేసర్, జూలై12: ఘట్‌కేసర్‌లో శుక్రవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు మోస్తారు వర్షం కురిసింది. గంటన్నర పాటు కురిసిన మోస్తారు వర్షంలో వీధుల్లో, రోడ్లపై కొద్దిపాటి వరదలు పారాయి. రెండు రోజులుగా సాయంత్రం సమయంలో కురుస్తున్న వర్షం రైతుల్లో ఆనందాన్ని నింపుతున్నాయి.


ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వర్షం













చౌదరిగూడలో బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న మహిళలు, తదితరులు

ఘనంగా పోచమ్మ బోనాలు

చౌదరిగూడ, జూలై 12: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వీరన్నపేట్‌లో గ్రామ దేవత పోచమ్మకు ప్రజలు బోనమెత్తారు. శుక్రవారం గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి బోనం తయారుచేసుకొని మహిళలు ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. యువకుల కేరింతలు మధ్య బోనాలు, ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులంతా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని మొక్కుకున్నారు.



చెరువును తలపిస్తున్న షాద్‌నగర్-పరిగి బీటీ రోడ్డు

కొందుర్గు, జూలై 12: మండల కేంద్రంలోని షాద్‌నగర్-పరిగి బీటీ రోడ్డుపై చిన్నపాటి వర్షపు చినుకులకే నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ప్రతీ రోజు మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ వైపు, వికారాబాద్ జిల్లా పరిగికి వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రంగారెడ్డి జిల్లాకు సరిహద్దు మండలం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. చిన్న పాటి వర్షానికే షాద్‌నగర్-పరిగి రోడ్డుపై నీరు నిలుస్తుంటోంది. శుక్రవారం సాయంత్రం కురిసిన చిరుజల్లులకు మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ వైపు వెళ్లే రోడ్డులో వైసీఆర్ ఫంక్షన్‌హాల్‌కు సమీపంలోని బీటీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్డుకు ఒక వైపు గుంత తీసి ఆ మట్టిని రోడ్డుకు దగ్గరగా పోయడంతో నీరు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. దాంతో వర్షపు నీరు షాద్‌నగర్-పరిగి బీటీ రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రజలు, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పై గ్రామ పంచాయితీ అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

మొయినాబాద్ రూరల్, జూలై 12: పోటీ ప్రపంచంలో విద్యార్థులు చురుకుగా ఉండాలని.. నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ సూచించారు. మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల జోగిన్‌పల్లి భాస్కరరావు ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రాత్రి జరిగిన 13వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జోగిన్‌పల్లి భాస్కర విద్యాసంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు, పీవోజీ చైర్మన్ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసుకున్న 450 మంది విద్యార్థులకు వారు పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం జస్టిస్ వేణుగోపాల్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులు చురుకుగా ఉండాలని, న్యాయ శాస్త్రంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ప్రిన్సిపాల్ కృష్ణామాచారి, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బీమా పాలసీలు గ్రామీణ ప్రజలకు వరం



బీమా చెక్కు అందజేస్తున్న సుబ్రమణ్యం

తాండూరు, జూలై 12: పోస్టాఫీసుల ద్వారా బీమా పాలసీలు గ్రామీణ ప్రజలకు ఒక వరం లాంటిదని సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ పోస్టాఫీస్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం అన్నారు. తాండూరులో శుక్రవారం ఇద్దరు గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కస్టమర్ల నామినీలు అయిన అరుణకు రూ.2లక్షల96వేలు, చంద్‌మియాకు రూ.91వేల చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవలం సంవత్సరానికి రూ.520 ప్రీమియంతో రూ.10లక్షల బీమా కవరేజీ సంవత్సరానికి అందించబడుతుందని తెలిపారు. విద్యుదాఘాతం, పాముకాటు మొదలైన వాటితో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే ఈ ఇన్సూరెన్స్ కవరవుతుందని తెలిపారు. అయితే శాశ్వత వైకల్యం కోసం పూర్తి బీమాను కూడా కవర్ చేస్తుందని చెప్పారు. రూ.లక్ష వరకు చికిత్స చార్జీలు చెల్లించబడుతుందని వివరించారు. మృతిచెందిన పాలసీ హోల్డర్ పిల్లలకు విద్యా ప్రయోజనాలకు కవర్ అవుతుందని తెలిపారు. అతి తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్‌తో పోస్టాఫీస్ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ క్రాంతి, పోస్ట్ మాస్టర్ శ్రీధర్, తాండూరు ఎస్‌వో క్రాంతి, పోస్ట్ కార్యాలయం తాండూరు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



నర్సరీని పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధి సంస్థ అడిషనల్ కమిషనర్ షఫీఉల్లా

పూడూరు, జూలై 12: పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని గ్రామీణాభివృద్ధి సంస్థ అడిషనల్ కమిషనర్ షఫీఉల్లా అన్నారు. మండలంలోని మిర్జాపూర్ గ్రామ నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకాన్ని పెంచాలన్నారు. అదేవిధంగా ప్రస్తుత వర్షాకాలంలో గుంతల్లో, మురుగు కాల్వల్లో, పాత వస్తువుల్లో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలన్నారు. లేదంటే నిల్వనీటిలో దోమలు అభివృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రతీచోట ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలన్నారు. గ్రామంలో పారిశుధ్యంపై ఎంపీడీవో ఎప్పటికప్పుడు మొక్కలు నాటాలని అన్నారు. గ్రామ పారిశుధ్యంపై ఎంపీడీవో ఎప్పటికప్పుడు సందర్శిస్తూ ప్రజలు రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తెలిపేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో, ఎంపీడీవో, ఏపీవో పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఐజీ



స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐజీ

ధారూరు, జూలై 12: మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం వికారాబాద్ జిల్లా ధారూరులో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఐజీ వెంట ఎస్పీ నారాయణరెడ్డి ఉన్నారు.

తాండూరులో ఫార్మాక్లస్టర్ ఏర్పాటుకు సీఎం అంగీకారం

- వెయ్యి ఎకరాల స్థల సేకరణకు ఆదేశం
- అమృత్ 2.0 కింద తాండూరు మున్సిపాలిటీ ఎంపిక
- పారిశ్రామికవాడ క్లియరెన్స్‌కు విన్నపం
- సానుకూలంగా స్పందించిన సీఎం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూలై 12: తాండూరు ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ఇందుకు సంబంధించి భూసేకరణ చేపట్టాలని ఆదేశించారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే హైదరాబాద్ నగరంలోని ఆయన నివాసంలో గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శుక్రవారం తాండూరులో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడారు. తాండూరులో ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు సీఎం సానుకూలంగా ఉన్నారని, ఇందుకు అవసరమయ్యే వెయ్యి ఎకరాల స్థలాన్ని సేకరించాలని సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులతో చర్చించి స్థలసేకరణ చేపడుతామన్నారు. అమృత్ 2.0 కింద తాండూరు మున్సిపాలిటీని ఎంపిక చేయాలని, చించోళి రోడ్డుమార్గంలోని జినుగుర్తి పారిశ్రామికవాడ ఏర్పాటుకు క్లియరెన్స్ ఇప్పించాలని, తాండూరులో పట్టణ శివారు రాజీవ్ గృహకల్ప సమీపంలో ఐదెకరాల స్థలంలో ఐటీసీ ఏర్పాటు చేయాలన్నారు. లారీ ట్రాక్ పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలని సీఎం కోరగా సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు. సాగునీటి పథకాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం సానుకూలంగా స్పందించినందుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



కమిటీ సభ్యులతో భేటీ అయిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కురియన్ కమిటీతో తాండూరు ఎమ్మెల్యే భేటీ

తాండూరు, జూలై 12: గడిచిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై కేంద్ర హైకమాండ్ పంపిన కురిన్ కమిటీతో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భేటీ అయ్యారు. నగరంలోని గాంధీభవన్‌లో శుక్రవారం కమిటీ బృందాన్ని కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఎన్నికల్లో తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ చేపట్టిన ప్రచారంతో సాధించిన ఓటు బ్యాంకు వివరాలను కమిటీ సభ్యుల ముందు ఎమ్మెల్యే వివరించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడం పట్ల పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై ఎన్నికలకు వెళ్లాయని, దీంతో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైందని కమిటీకి వివరించారు. రామమందిరం నినాదం కూడా బీజేపీకి అనుకూలంగా మారిందని ఆయన కమిటీకి వివరించారు. బీజేపీకి అనుకూలంగా మారిందని ఆయన కమిటీకి వివరించారు.


ఇక సులభతరం..

- విద్యార్థులకు ఈజీగా అర్థమయ్యేలా పాఠ్యపుస్తకాల ముద్రణలో మార్పులు
- ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు ద్విభాష పాఠ్యపుస్తకాలు

కులకచర్ల, జూలై 12: ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా వారిలో నైపుణ్యం పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం ఆంగ్ల విద్యను అమలు చేస్తుంది. అయితే ఆంగ్లబోధన వింటున్న విద్యార్థులకు మూడేళ్లుగా ద్విభాష (తెలుగు, ఆంగ్లం) పుస్తకాలు అందిస్తుంది. ప్రతీ సంవత్సరం ఒక్కో తరగతి పెంచుతూ ద్విభాష పుస్తకాలను పంపిణీ చేస్తుండగా ఈ విద్యాసంవత్సరం నుంచి పదో తరగతికి వర్తింపజేయనున్నారు. ఈ మేరకు పాఠ్యపుస్తకాలు రాగా, వాటిని ఉమ్మడి కులకచర్ల మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఆంగ్ల బోధనతో చదువుతున్న దాదాపు 690 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

విద్యార్థులు ఇబ్బంది పడకుండా..

ప్రభుత్వం సక్సెస్ పాఠశాలల పేరుతో కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రారంభించింది. అయితే బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇవి పూర్తి స్థాయిలో విజయవంతం కాలేదు. ఇలాంటి నేపథ్యంలో తిరిగి 2022-23 విద్యాసంవత్సరం నుంచి విద్యాశాఖ అన్నీ పాఠశాలల్లో ఆంగ్ల బోధన అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే అప్పటి వరకు తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదవడం ఇబ్బందిగా ఉంటుందని గుర్తించి వారు



ద్విభాషలో ముద్రించిన పదో తరగతి సామాన్య శాస్త్రం

తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్రణలో మార్పులు చేశారు. ప్రతీ పాఠ్యాంశంలో ఓ పేజీలో తెలుగు, మరో పేజీలో ఆంగ్లంలో ముద్రించారు. మొదటి సారిగా ఎనమిదో తరగతి వరకు భాషేతర పుస్తకాలైనా గణితం, సామాన్య శాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం పుస్తకాల్లో ముద్రించారు. మరుసటి ఏడాది తొమ్మిదో తరగతికి అందించగా ప్రస్తుత ఈ విద్యాసంవత్సరం నుంచి పదో తరగతికి వర్తింపజేయనున్నారు. దీంతో విద్యార్థులు సులభంగా పాఠాలు అర్థం చేసుకునేందుకు ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు అవకాశం ఉంటుంది. అదే విధంగా విద్యార్థులకు పుస్తకాల భారం కాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ప్రతీ పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించడంతో పేజీల సంఖ్య పెరిగి రెట్టింపు భారం అవుతుంది. ఈ సమస్య తలెత్తకుండా రెండు విభాగాలుగా పుస్తకాలను విభజించారు. సగం పాఠాలను భాగం-1గా మిగతా సగాన్ని భాగం-2గా విభజించి రెండు దఫాలుగా పుస్తకాలను అందించనున్నారు. ఈ ఏడాది పదోఓ తరగతి వరకు ద్విభాష పుస్తకాలను అందించడంతో ఇప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఆంగ్ల బోధన అందినట్లేనని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

చాలా సులభంగా అర్థం అవుతుంది



తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో పుస్తకాలు ముద్రించడంతో చదువుతో పాటు అర్థం చేసుకునేందుకు చాలా సులభంగా ఉంది. గతేడాది కొద్దిగా భయం ఉండేది. ప్రస్తుతం ద్విభాషలో పుస్తకాలు ముద్రించడంతో పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాం

- కార్తీక్, 10వ తరగతి విద్యార్థి, కులకచర్ల

నాలో భయం పోయింది



పదో తరగతిలో ద్విభాషలో పుస్తకాలు ముద్రించి రావడంతో పాఠాలు సులభంగా అర్థం అవుతున్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను తెలుగులో చదవడంతో పాటు ఆంగ్లంలో సులభంగా ఉంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తామనే భరోసా వచ్చింది.

అనిత, పదో తరగతి విద్యార్థిని, ముజాహిద్‌పూర్

విద్యార్థులకు చాలా సులభం



ద్విభాషలో 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు ముద్రించడంతో సులభంగా అర్థమయ్యేలా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా ఉంది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేందుకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించవచ్చు. విద్యాబోధనలో ఎలాంటి ఇబ్బంది రాకుండా మంచి నిర్ణయం తీసుకున్నారు.

- హబీబ్ అహ్మద్, ఎంఈవో, కులకచర్ల



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గురునాథ్‌రెడ్డి

కొడంగల్, జూలై 12: తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో శుక్రవారం సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ పదవితో సముచితస్థానం కల్పించడంతో సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో విదేశీ మహిళకు 12 ఏళ్ల జైలు, రూ.లక్ష జరిమానా

శంషాబాద్ రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా డ్రగ్స్ తరలిస్తుండగా పట్టుబడిన కేసులో ఎల్‌బీ నగర్ కోర్టు ఓ విదేశీ మహిళకు 12 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించినట్లు డీఆర్‌ఐ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. 2021లో దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న టాంజానియాకు చెందిన మహిళ 2,980 గ్రాముల డ్రగ్స్ (హెరాయిన్) కలిగి ఉంది. ఎయిర్‌పోర్టులో డీఆర్‌ఐ (డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్) అధికారులు బ్యాగులు తనిఖీ చేస్తుండగా ఆ మహిళ వద్ద డ్రగ్స్ పట్టుబడింది. డ్రగ్స్ విలువ దాదాపు రూ.97.37 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అప్పట్లో డీఆర్‌ఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలు కోర్టుకు సమర్పించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఆ మహిళకు 12 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించారు.

పార్టీలకతీతంగా పట్టణ ప్రగతి

- రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి
- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, వేదికపై ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, జూలై 12: షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని, పార్టీలకతీతంగా పట్టణ ప్రగతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ భవనంలో కమిషనర్ వెంకన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే శంకర్‌తోపాటు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి, అన్ని వార్డుల్లో ప్రతీరోజు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, పాడైన వీధి దీపాలను ఎప్పటికప్పుడు మార్చాలని, మున్సిపాలిటీ నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, దొంగతనాలను అరికట్టాలని కోరారు. ప్రతీఇంటికి మిషన్ భగీరథ కనెక్షన్లను ఇప్పించాలని, పట్టణంలో పెరిగిపోతున్న వీధి కుక్కల బెడదను నివారించాలని, మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వాలని, పట్టణ ప్రగతికై ప్రత్యేక నిధులు తేవాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనతో పాటు పార్టీలకతీతంగా పట్టణ ప్రగతికి అందరూ కృషి చేయాలని సూచించారు. షాద్‌నగర్ చౌరస్తా నుంచి వై జంక్షన్ వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులకు ప్రతీఒక్కరు సహకారం అందించాలని, సర్కిల్ విస్తరణ కోసం కమిటీని నియమిస్తానని తెలిపారు. నిబంధనలకు లోబడి ఇంటి నిర్మాణాలు జరిగేలా మున్సిపల్ సిబ్బంది ద్వంద్వవైఖరిని వీడి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని, అందరూ కలిసి పనిచేస్తేనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయండి



మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హనుమంత్‌రావు

కీసర, జూలై 12: మండల కేంద్రంలోని దళితులకు న్యాయం చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి.హనుమంత్ రావు శుక్రవారం మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. కీసర దాయర సర్వేనంబర్ 173, 174, 175, 176, 179, 213లో దాదాపు 94.06 ఎకరాల భూమిని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఇచ్చారని, దాదాపు 10మంది దళితులకు పట్టాలు ఇచ్చి భూమి కేటాయించినట్లు తెలిపారు. అయితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు వారి పేర్లు తొలగించి రాగి కుటుంబానికి చెందిన వ్యక్తుల పేర్లు రికార్డులో నమోదు చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో కీసరకు చెందిన పలువురు దళితులు కోర్టును ఆశ్రయించారని, వివాదంలో ఉన్న భూమికి కీసర రెవెన్యూ అధికారులు కన్వెర్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కన్వర్షన్ రద్దు చేసి దళితులకు న్యాయం చేయాలని వీహెచ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, జూలై 12: ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీతో పాటు, ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ తెలిపారు. మండలంలోని కేరెల్లి, అల్లీపూర్, కుక్కింద, ధారూరులో శుక్రవారం సాయంత్రం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం తెలంగాణను ఆర్థిక విధ్వంసం చేసిందని ఆరోపించారు. ఆగస్టు 15నుంచి రైతు రుణమాఫీ, ఆరుగ్యారంటీలను అందజేస్తామన్నారు. నియోజకర్గంలో ఏడాదికి 7వేల పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన చెప్పారు. నిరుద్యోగులకు జిల్లాకు పరిశ్రమలు తెచ్చి, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. మహిళల కోసం టెక్స్‌టైల్ పార్కులను తీసుకువస్తున్నామని చెప్పారు. కాగా ధారూరు, కెరెల్లి పాఠశాలలో లయన్స్ క్లబ్ వారు నిర్మించిన మరుదొడ్లను ప్రారంభించి విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాములు పాల్గొన్నారు.

వనమహోత్సవం లక్ష్యాలను పూర్తిచేయాలి

వికారాబాద్, జూలై 12: ఈ సంవత్సరం వనమహోత్సవం లక్ష్యాలను పూర్తిచేయాలని స్పెషల్ కమిషనర్, ఐఎఫ్ఎస్ షఫిఉల్లా అన్నారు. జిల్లా పరిధిలోని మిర్జాగూడ సమీపంలో శుక్రవారం గల నర్సరీ, పల్లె ప్రకృతివనం, క్రీడాప్రాంగణంలో పనులను సందర్శించి అనంతరం వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్, బృహత్ పల్లెప్రకృతి వనం, పండ్ల తోటలు, వాటర్‌షెడ్‌లో చేపట్టిన అమృత్ సరోవర్ పనులను సందర్శించి పనులపై సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం వికారాబాద్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి జిల్లాలో చేపట్టిన ఉపాధిహామీ పనుల పురోగతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం నర్సింగ్‌రావు, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఈసీఎస్, డీఆర్‌డీఏ కార్యాలయ సిబ్బంది క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ వై జంక్షన్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



44వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో పెద్దఎత్తున నిలిచిన వాహనాలు

- డీసీఎం, లారీని ఢీకొన్న మరో ట్రైలర్ లారీ
- లారీ స్కూటీపై పడటంతో ఒకరు దుర్మరణం.. ఇద్దరికి గాయాలు
- భారీగా ట్రాఫిక్ జామ్.. రెండు గంటలకు పైగా నిలిచిన వాహనాలు

కొత్తూర్: జూలై 12: మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారి వైజంక్షన్ వద్ద శుక్రవారం ఓ డీసీఎంతో పాటు లారీని మరో ట్రైలర్ లారీ ఢీకొనడంతో ఘోర ప్రమాదం సంభవించింది. రహదారి గుండా వెళ్తున్న బైకిస్టుపై లారీ పడడంతో, అందేలో ఉన్న సరుకుల కింద పడి ఒకరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాదానికి గురైన లారీలు రహదారికి అడ్డంగా పడటంతో బెంగుళూరు వైపు వెళ్లే జాతీయ రహదారి పూర్తిగా స్తంభించిపోయింది. రెండు గంటలకు పైగా దాదాపు 10కిలోమీటర్లు మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులతో



కొత్తూర్ వైజంక్షన్ ప్రమాద స్థలిలో పోలీసులు

పాటు, ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. కొందరు ప్రయాణికులు వాహనాల నుంచి దిగి కాలినడకన గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తూర్ నుంచి వైజంక్షన్ మీదుగా షాద్‌నగర్ వైపు వచ్చేందుకు డీసీఎం వాహనం జంక్షన్ వద్ద మల్లుతుండగా షాద్‌నగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు పైపుల లోడ్‌తో వెళ్తున్న భారీ ట్రైలర్ లారీ డ్రైవర్ డీసీఎంను ఢీకొట్టి, రోడ్డుకు కుడి వైపు వెళ్లి హైదరాబాద్ నుంచి తమిళనాడు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో లారీ బోల్తాపడింది. ఈ క్రమంలో లారీ పక్కనుంచి కొత్తూర్ వైపు వస్తున్న స్కూటీపై లారీ పడడంతో, లారీలో ఉన్న సరుకులు స్కూటీపై వెళ్తున్న వ్యక్తులపై పడ్డాయి. దాంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద సంఘటన పరిశీలించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, స్థానికుల సహాయంతో బోల్తాపడ్డ లారీ సరుకుల కింది నుంచి ఇద్దరు వ్యక్తులను బయటకు తీశారు. అప్పటికే ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలకు గురైనాడు. మృతిచెందిన వ్యక్తి కొత్తూర్ మండలం పెంజర్ల గ్రామానికి చెందిన అంజయ్య(50)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి కూడా పెంజర్లకు చెందిన దినేష్‌గా గుర్తించారు. పైపుల లోడుతో వెళ్తున్న ట్రైలర్ లారీ డ్రైవర్ ప్రహ్లాద్(45) అందులోనే ఇరుక్కుపోయాడు. స్థానికులతో సహాయంతో పోలీసులు ప్రహ్లాద్‌ను బయటకు తీశారు. అతడి రెండు కాళ్లు విరిగిపోయాయి. గాయపడ్డ ప్రహ్లాద్‌తో పాటు దినేష్‌ను ఆసుపత్రికి తరలించారు. తమిళనాడు లారీ డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే పరారయ్యాడు. డీసీఎం డ్రైవర్‌కు స్వల్పగాయాలైనాయి. రహదారిపై బోల్తాపడ్డ తమిళనాడు లారీతో పాటు, ప్రమాదానికి గురైన ట్రైలర్ లారీ రహదారిపై నిలిచిపోవడంతో బెంగుళూరు 44వ జాతీయ రహదారి పూర్తిగా స్తంభించిపోయింది. రెండు గంటలకు పైగా రహదారి స్తంభించడంతో దాదాపు 10కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోయాయి. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్‌లు సిబ్బందితో కలిసి ప్రొక్లెయిన్ల సహాయంతో అతికష్టం మీద ట్రైలర్ లారీతో పాటు, బోల్తాపడ్డ లారీని పక్కకు తప్పించారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాద సంఘటన స్థలం భయానక వాతావరణంగా మారింది. మృతదేహాన్ని పోలీసులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

● ఎమ్మెల్యేలు, వీర్లపల్లి శంకర్, యాదయ్య



యాచారం : మొక్కలు నాటిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, జూలై 12: పర్యావరణాన్ని పరిరక్షించే పచ్చదనానికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విరివిగా మొక్కలు నాటి సంరక్షిస్తేనే ముందు తరాలకు భవిష్యత్తు బాగుంటుందని అభిప్రాయపడ్డారు. పెరుగుతున్న కాలుష్యానికి విరుగుడు పచ్చదనాన్ని పెంచడమేనని అన్నారు. ముఖ్యంగా పట్టణాలు, గ్రామాల్లో పండ్ల మొక్కలను, ఆరుబయట మహా వృక్షాలుగా ఎదిగే మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, కౌన్సిలర్ పావని, కమిషనర్ వెంకన్న, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



షాబాద్ : లక్ష్మారావుగూడలో మొక్కలు నాటుతున్న స్వాధ్యాయ పరివార్ బృందం

మున్సిపాలిటీకి అండగా ఉంటా : ఎమ్మెల్సీ

షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అండగా నిలిచి, కౌన్సిలర్ల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆఫీసులో శుక్రవారం నవీన్‌కుమార్‌రెడ్డిని చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. నవీన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలిపించిన స్థానిక సంస్థల సభ్యులకు అండగా ఉంటానని ఆయన అన్నారు.

శంకర్‌పల్లి : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. మాసానిగూడలో వన మహోత్సవం నిర్వహించారు. అధికారులు, గ్రామస్తులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా రెండు మొక్కలు నాటాలని సూచించారు. ఎంపీడీవో వెంకయ్యగౌడ్, పంచాయితీ అధికారి గీత, ఏపీఎం భీమయ్య, ఏపీఓ నాగభూషణం, మాజీ సర్పంచ్ రాములు తదితరులు ఉన్నారు.

యాచారం : మండలంలోని వివిధ గ్రామాల్లో లక్షా20 వేల మొక్కలు నాటి సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి వెల్లడించారు. యాచారం, మల్కీజ్ గూడ. మేడిపల్లి గ్రామాలలో పర్యటించి మొక్కలు నాటారు. రోడ్ల వెంట విరివిగా గుంతలు తీయిస్తున్నామన్నారు. అటవీసంపద పెంచడం కోసం ప్రతి వ్యక్తి నాలుగు మొక్కలు నాటి కాపాడుకోవాలన్నారు. మొక్కల సంరక్షణపై ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంనుంచి ఫీల్డ్ అసిస్టెంట్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మొక్కల సంరక్షణపై పలు సూచనలు చేశారు. ఆయనవెంట ఉపాధి హామీ పథకం ఏపీవో శివశంకర్‌రెడ్డి ఉన్నారు.



శంకర్‌పల్లి : మొక్కలు నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడాలని స్వాధ్యాయ పరివార్ బృందం సభ్యులు అన్నారు. శుక్రవారం స్వాదాయ పరివార్ (దీదీ) జయశ్రీ తల్వార్‌కర్ జన్మదినం పురస్కరించుకొని మండలంలోని లక్ష్మారావుగూడ, ఎర్రోనిగూడ, ముద్దెంగూడ, తాళ్లపల్లి, కేశవగూడ, బోనగిరిపల్లి, షాబాద్, కొమరబండ, బొబ్బిలిగామ తదితర గ్రామాల్లో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలన్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని వక్తలు తెలిపారు. స్వాధ్యాయ పరివార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడిగడ్డ తండా వాసికి డాక్టరేట్



ప్రొ. చెన్నప్ప నుంచి డాక్టరేట్ అందుకుంటున్న రమేశ్‌నాయక్

ఆమనగల్లు, జూలై 12: మండలంలోని మేడిగడ్డ తండాకు చెందిన నేనావత్ రమేశ్ నాయక్‌కు ఉస్మానీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ చెన్నప్ప మార్గదర్శకత్వంలో రమేశ్ నాయక్ పాలసీ హోల్డర్స్ సాటిసిపాక్షన్ టు వర్డ్స్ సర్వీసెస్ ఆఫర్ బై లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఇండియా ఏ స్టడీ విత్ రెఫరెన్స్ టు హైదరాబాద్ డిస్ట్రిక్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఓయూ కామర్స్ డిపార్ట్‌మెంట్ రమేశ్ నాయక్‌కు శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తనకు డాక్టరేట్ లభించడం ఆనందంగా ఉందని రమేశ్ అన్నారు. తనకు సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు, బాలికలకు రక్షణగా క్రిమినల్ చట్టాలు



మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

కేశంపేట, జూలై 12: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన క్రిమినల్ చట్టాలు మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక స్థానం కల్పించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ వివరించారు. మండల పరిధిలోని కొత్తపేట జూనియర్ కళాశాలలో శుక్రవారం నూతన చట్టాలు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమంలపై అవగాహన కల్పించారు. నూతన చట్టాల ప్రకారం డిజిటల్ వస్తువులను సాక్షాధారాలుగా పరిగణిస్తారని తెలిపారు. వీసీ అశోక్ కుమార్, ఎస్‌పీవో కృష్ణయ్య తదితరులున్నారు.

వారాహి మాతకు ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న మహిళలు

చేవెళ్ల, జూలై 12 : మండల కేంద్రంలోని కొనగట్టులో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం వారాహి మాత అమ్మవారికి ప్రత్యేక పూజా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబ, వారాహి మాతలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తే కోరిన కోర్కెలు నేరవెరుతాయని ప్రధాన అర్చకుడు జయం సురేశ్ భక్తులకు వివరించారు. పలు గ్రామాల మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న ప్రతినిధులు

శంషాబాద్ రూరల్, జూలై 12 : మండల పరిధిలోని పాల్మాకుల మోడల్ స్కూల్ విద్యార్థులకు వేరైజాన్ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం బ్యాగులు, స్టేషనరీ పంపిణీ చేశారు. పాఠశాలకు ఐసీటీ, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే పనులు ప్రారంభించారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి విద్యార్థులకు మంచి విద్యనుందించాలనే ఉద్దేశ్యంతో అధునాతన ల్యాబ్‌ను వేరైజాన్ కంపెనీ నిర్మిస్తోందని, వాటిని పరిశీలన కోసం ప్రతినిధులు స్కూల్‌ను శుక్రవారం సందర్శించారని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ పేర్కొంది. కంపెనీ ప్రతినిధులు కరుణాకర్, కిశోర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కందుకూరు, జూలై 12: మధ్యాహ్న భోజన కార్మికలకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని, లేని పక్షంలో ఈనెల 15 నుంచి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఆ సంఘం నేతలతో కలిసి మండల విద్యాధికారి మనోహర్‌కు మెమోరాండం అందజేశారు.

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

ఆమనగల్లు, జూలై 12: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజా పాలన ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అన్ని ప్రాంతాలకు, వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమన్యాయం చేస్తుందన్నారు. ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి, కడ్తాల మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. స్థానిక బస్టాండ్‌లో ఆర్ఎం శ్రీదేవి, డీఎం సుభాషిణి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంలతో కలిసి నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను కసిరెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా జిల్లాస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పలు కాలనీలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించగా పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో.. పెరిగిన రద్దీకి అనుగుణంగా ప్రయాణికులు ఇబ్బంది పడకూడదని అన్ని డిపోలకు ప్రభుత్వం కొత్త బస్సులను కేటాయిస్తోందన్నారు. వచ్చే ఏడాదిలోపు అన్ని మారుమూల గ్రామాలు, గిరిజన తండాలకు రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆగస్టు 15 నాటికి రైతు రుణాలు ఏకకాలంలో మాఫీ చేయడం జరుగుతుందన్నారు. సాగు చేసే భూమికి రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని ప్రాంతాలలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు చెప్పారు. కేఎల్‌డీ-82 కాల్వ అసంపూర్తి పనులు సెప్టెంబర్‌లోగా పూర్తి చేసి 35 వేల ఎకరాలకు సాగునీరందిస్తామని నారాయణ రెడ్డి వివరించారు. రాష్ట్రంలో ప్రజారంజక పాలన చూసి బీఆర్ఎస్ ఓర్వలేక కుట్ర రాజకీయాలు సాగిస్తుందన్నారు. విద్య, ఉపాధి కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, నాయకులు ఆనంద్, సంజీవ్ కుమార్, భూపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పర్వత్ రెడ్డి, రాహుల్, చంద్రకాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులున్నారు.



ఆమనగల్లులో ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

సమాజాభివృద్ధికి గ్రంథాలయాలు దోహదం

కందుకూరు, జూలై 12: సమాజాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. అమెజాన్ కంపెనీ ఆధ్వర్యంలో మండలంలోని నేదునూరులో అంగన్‌వాడీ భవనం, కొత్తూరులో గ్రంథాలయం భవనాన్ని ప్రారంభించి, కొత్తగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడారు. వ్యక్తిగతంగా, మానసికంగా, సమాజాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ గ్రంథాలయాలను గ్రామీణ ప్రాంత యువతకు అందుబాటులో తీసుకురావడానికి ఎంతో కృషి చేశారన్నారు. రంగారెడ్డి జిల్లాలో అమెజాన్, సెర్ప్ అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. జిల్లాలోని షాబాద్, కందుకూరు, మహేశ్వరం తదితర మండలాల్లో అమెజాన్ కంపెనీ ప్రతినిధులు అనేక సేవాకార్యక్రమాలను చేపట్టినట్లు గుర్తుచేశారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి శంకర్ మాట్లాడుతూ తమ కంపెనీ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజలకు వెబ్‌సైట్ సేవలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు.



కొత్తూరులో గ్రంథాలయం ప్రారంభించి పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలిని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కోరారు. కొత్తగూడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఆమె మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, ఎండీవో సరిత, ఎంపీవో విజయలక్ష్మీ, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, జి.గోపాల్‌రెడ్డి, పల్లె వసంత, మాజీ ఎంపీటీసీలు సురేష్, ఇందిరదేవేందర్, కృష్ణగౌడ్, నాయకులు బర్కం వెంకటేష్, లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, దామోదర్‌గౌడ్, సామ ప్రకాష్‌రెడ్డి, టి.లక్ష్మణాచారి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కేశంపేట : మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజారత్నం

కేశంపేట, జూలై 12: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ రాజారత్నం సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, డయేరియాల నివారణకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యాధుల నివారణకు, ప్రజలను అప్రమత్తం చేయడానికి అంగన్‌వాడీ, వైద్య శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యాశాఖ, మహిళా సంఘాల అధికారులు సమన్వయంతో ముందుకుసాగాలని సూచించారు. ఎంపీడీవో రవి చంద్రకుమార్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిత, ఎంపీవో కిష్టయ్య, ఎంపీహెచ్, ఈవోలు ఆంజనేయులు, ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శులున్నారు.

ఆమనగల్లు : మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం స్థానిక కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని 7, 10, 15వ వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, ఝాన్సీశేఖర్, చెక్కాల లక్ష్మణ్, సుజాతరాములు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మున్సిపాలిటీలోని 15వ వార్డు శివాలయ నగర్ కాలనీలో శుక్రవారం డెంగీ, మలేరియా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు శుభ్రం చేయించారు. కార్యక్రమంలో దామోదర్, వెంకటేశ్, ఎల్లయ్య, సంతోష, గౌతమి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వసంత

హామీలను అమలు చేయాలి

చేవెళ్ల, జూలై 12 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలన్నారు. ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, గ్రామ ప్రధాన కార్యదర్శి ఎం.పెంటయ్య, మండల మహిళ అధ్యక్షురాలు వడ్ల మంజులు, నాయకులు తదితరులు ఉన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..

ఆదిభట్ల : ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిభట్లలోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చినట్లు కళాశాల చైర్మన్ కాప్పా లక్ష్మీనారాయణ, సెక్రటరీ ఎ.శ్రీధర్‌రెడ్డిలు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ అటానమస్ గుర్తింపు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లు, సిబ్బంది, అధ్యాపక బృందం కృషి వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు. ఇప్పటికే నాక్-ఏ గుర్తింపు పొందిన కళాశాలకు త్వరలో ఎన్‌బీఏ గుర్తింపు రానున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తదితరులున్నారు.

షాద్‌నగర్ అర్బన్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను స్థానిక బీజేపీ నాయకులు సన్మానించి, అభినందనలు తెలిపారు. శంషాబాద్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్త, జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలాచారిలు సన్మానించారు.

షాబాద్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాచ్ఛ అన్నారు. ఈమేరకు తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే ప్రోగ్రాం నిర్వహించారు. శుక్రవారం విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాఘవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చేవెళ్ల : నగరంలోని గాంధీ భవన్‌లో శుక్రవారం జరిగిన ఏఐసీసీ నిజనిర్ధారణ కమిటీ సభ్యులను రాష్ట్ర పొల్యుషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమికి గల కారణాలను తెలియజేస్తూ ఓ లెటర్‌ను కమిటీ సభ్యులకు సత్యనారాయణరెడ్డి అందజేశారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

తలకొండపల్లి : మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ వెల్జాల బాలికల ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస మూర్తి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, జిల్లా నాయకుడు పాలకుర్ల రాములులు చరికొండలో పర్యటించారు. వివిధ కారణాలతో మృతిచెందిన మిద్దె జంగయ్య, చిందం గుండాలు, కిష్టమ్మల కుటుంబాలను కాంగ్రెస్ నేతలతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.11 వేలు ఆర్థికసాయం అందజేశారు. మహేశ్, రాములు, తదితరులున్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి మరణానికి కారణమైన నిందితుడికి మూడేళ్ల జైలు

యాచారం, జూలై 12 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణానికి కారకుడవ్వడంతో పాటు మరో వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం కోర్టు న్యాయాధికారి హిమబిందు శుక్రవారం తీర్పు వెల్లడించారు. కోర్టు మున్సిఫ్ సతీష్ కథనం మేరకు.. 2018లో ఫిబ్రవరి 22న నగరంలోని మీర్‌పేటకు చెందిన గోవింద్ నారయ్య(49), అతని సోదరుడు గోవింద్ వినయ్‌లు బైక్‌పై మాడ్గుల నుంచి స్వగ్రామం వెళుతున్నారు. నల్గొండ జిల్లా అనుముల మండలంలోని శాంతినగర్‌కు చెందిన నడ్డి రామచంద్రయ్య తక్కళ్లపల్లి తండా సమీపంలో కారును అతివేగంతో నడుపుతూ ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్‌చేసి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో ద్విచక్రవాహనంపై ఉన్న నారయ్య(47) తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. అతడి మరణానికి కారకుడైన నడ్డి రామచంద్రయ్యకు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా, ఇదే ప్రమాదంలో వినయ్‌ని తీవ్రంగా గాయపరచినందుకు గాను ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి

చేవెళ్ల, జూలై 12 : బైక్ బోల్తాపడిన ఘటనలో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందగా.. మరో యువకుడికి తీవ్రగాయలు కాగా ఇంకొకరు స్వల్పగాయాలతో బయపడ్డారు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దామరిగిద్ద గ్రామానికి చెందిన సీహెచ్ రాజేశ్ (17), అదే గ్రామానికి చెందిన పి.విజయ్‌కుమార్, అభిషేక్‌లతో కలిసి ఒకే బైక్‌పై గురువారం సాయంత్రం చేవెళ్లకు వస్తున్నారు. మార్గమధ్యలోని చేవెళ్ల పరిధిలో గల మోడల్ కాలనీలోకి రాగానే బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషయమించడంతో సీహెచ్ రాజేశ్‌ను ఉస్మానియాకు తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. విజయ్‌కుమార్‌కు చేయి విరగడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అభిషేక్ స్వల్పగాయలతో బయటపడ్డాడు. మృతిచెందిన రాజేశ్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం శుక్రవారం దామరిగిద్దలో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

● ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రమాదం

కొందుర్గు, జూలై 12: విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీదేవునిపల్లిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు.. లక్ష్మీదేవునిపల్లికి చెందిన సుధాకర్‌గౌడ్ తన ఆవును పొలంలో మేత మేసేందుకు వదిలాడు. ఈక్రమంలో ఆవు మేత మేసుకుంటూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్ళింది. దాంతో కరెంట్‌షాక్ తగలడంతో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, ఆవు విలువ దాదాపు రూ.70వేలు ఉంటుందని, తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతు సుధాకర్ గౌడ్ కోరారు. అయితే, ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేకపోవడంతోనే ఆవు మృత్యువాత పడిందని గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ అధికారులు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కరెంట్ షాక్‌తో మృతిచెందిన ఆవు

బోరు మోటార్ల సర్వీస్ వైర్లు అపహరణ

ఆమనగల్లు, జూలై 12: మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పలు ఇళ్లలో బోరు మోటర్ల సర్వీస్ వైర్లను అపహరించుకెళ్లారు. ప్రహరీ గోడల మీదుగా ఇళ్లలోకి దిగి కాంపౌండ్ వాల్స్ లోపల ఉన్న సర్వీస్ వైర్లను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం యజమానులు బోర్లు వేయగా పనిచేయకపోవడంతో వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యానగర్ కాలనీకి చెందిన మాజీ ఎంపీటీసీ దోనాదుల కుమార్ తెలిపారు.

పాఠశాల గది ధ్వంసంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 12: ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల గది ధ్వంసంపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తుల పాఠశాలలోని ఒక గది తలుపులను బద్దలుకొట్టి లోపలికి వెళ్లి మద్యం సేవించారు. అలాగే కిటికీలను, సీలింగ్ ఫ్యాన్‌ను విరగ్గొట్టారు. శుక్రవారం ఉదయం గమనించిన గ్రామస్తులు విధ్వంసానికి పాల్పడిన దుండగులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాస్, గ్రామస్తులు ఎన్.పుల్లారెడ్డి, ఎల్.అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులున్నారు.

నక్షబాటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి, జూలై 12 : నక్షబాటను ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన రైతు రాంచందర్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 32 ఏళ్లక్రితం తాను దొంతాన్‌పల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 102-ఏ లో 0-39 గుంటల భూమిని బద్రి రాములు వద్ద కొనుగోలు చేశానని తెలిపాడు. అప్పటి నుంచి భూమిలో పంట సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని వివరించాడు. కాగా తాను పొలానికి వెళ్లే నక్షబాట ఆక్రమణకు గురవ్వడంతో, పొలాల నుంచి వెళ్లి పనుల చేసుకునేవాడినని అన్నాడు. తనకు జరిగిన అన్యాయం గురించి కలెక్టర్‌తో పాటుగా ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. అధికారులు సర్వే చేసి న్యాయం చేయాలిని కోరాడు.

మైసిగండి మైసమ్మ ఆలయానికి రూ. 52.23 లక్షల 'టెండర్' ఆదాయం

కడ్తాల్, జూలై 12: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయం ఆవరణలో శుక్రవారం కొబ్బరి కాయల విక్రయం, వాహన పూజ రుసుము వసూళ్లు చేసుకొను హక్కులకు సంబంధించి వేలం పాట నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో వై.శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలతల సమక్షంలో వేలం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి గాను నిర్వహించిన కొబ్బరి కాయల వేలం పాటలో ముగ్గురు డిపాజిట్ దారులు పాల్గొన్నారు. మైసిగండికి చెందిన రామావత్ అమ్మనాయక్ రూ.39.12 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. వాహన పూజ రశీదు రుసుము వసూళ్లకు గాను ముగ్గురు డిపాజిట్ దారులు పాల్గొనగా మైసిగండికి చెందిన కేతావత్ శివరామ్ రూ.13.11 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, సిబ్బంది రామావత్ భాస్కర్, మాదారం యాదగిరి, బోడ్యనాయక్, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, అమ్మనాయక్, రాజునాయక్, పరంసింగ్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఈసీసీఈపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

ఆమనగల్లు, జూలై 12: ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య, సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో రోజా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన 220 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ప్రియదర్శిని పుస్తకాలను అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. ఈసీసీఈపై పార్వతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.